

## తెలుసుకుందాం... 



## పొడుపు కథలు

**చెప్పుకోండి**

- తెలిసేలా పూస్తుంది. తెలియకుండా కాస్తుంది?

  **పల్లికాయ**

- రాజు నల్లన. ప్రధాని పచ్చన. పాలు పుల్లన?

  **- తాటి చెట్టు**



## మంచిమాట



నీలో లోపాన్ని ఎవరైనా
వేలెత్తి చూపిస్తే..
ఆగ్రహించకు. నీ మేలు
కోరేవారు ఒక్కరైనా ఉన్నారని
ఆనందించు!



## రంగులేయండి



**చుక్కల ఆధారంగా బొమ్మ గీసి, రంగులు వేయండి.**

## జరమచ్చింది

... ✍ పత్తిపాక మోహన్

**పిలగాండ్లూ!**

అకుబర్, బీరుబల్ కతలు మీకు ఎరుకే గదా! ఇది అసొంటి కతనే! ఒకపారి పాపం బీరుబల్‌కు జర మొచ్చింది. కచేరీలకు నాలుగైదు దినాలు పోలేదు. బీరుబల్ రాక పోయేటాలకు.. దినాము పొద్దువోలేదు అకుబర్‌కు. ఆల్లనీల్లను అడిగితె.. జరమచ్చింది, గందుకే కచేరీలకు అత్తలేడంట జెప్పింండ్రు. తన తాన పనిజేశిన చిన్నప్పటి సోపతాయె! సూసద్దమని ఇంటికి వోయిండు. అకుబర్ పోయెటాలకు నెత్తి మీద తడి బట్ట గప్పుకొని మంచం మీద ఉన్నడు బీరుబల్. అకుబర్‌ను సూడంగనే చేయి లేపి సలాం జేశిండు. నాలుగైదు దినాల సంది తిండి తిప్పలు లేకపోయె వరకు బీరుబల్ పీనుగోలె అయిండు. ఆయినెను సూసి.. మునుపటి క్యాలి ఉందా? లేదా? సూడాలనుకున్నడు అకుబర్. అంతట్లకే దూపయి నీళ్లు తాగనీకి మెల్లగ లేశి, పక్క అర్రలకు పోయిండు బీరుబల్. ఆయినె పోవుడుతోనే.. జేబులకెల్లి రుమాలు దీసి, బీరుబల్ మెత్తకింద వెట్టి.. ఏం దెలువనట్టే గూకున్నడు అకుబర్. నీళ్లు తాగి అచ్చినంక మెత్తమీద తలకాయ వెట్టంగనే.. ఎట్లనో అనిపియ్య వట్టింది బీరుబల్‌కు. అటూఇటూ బొర్రవట్టిండు. ఏడనో కిందమీదైనట్టు అనిపిచ్చింది. ఆయినె ఆపసోపాలు వడుడు సూశి.. ''ఏమైంది? గట్ల జేస్తున్నవు'' అంట అడిగిండు అకుబర్. ''ఇంతట్లకే నా మంచం మీద ఏదో కిందమీదైంది. ఏమైందో తెలుత్తలేదు'' అన్నడు బీరుబల్. ''ఏ జరమచ్చింది గదా! అట్లనే గొడ్తది. ఏంగాలే!'' అంట అన్నడు అకుబర్. ''కాదు కాదు. మెత్త కింద ఏదో ఎత్తుగ గొడ్తంది!'' అంట శెయ్యి వెట్టిండు. శెయ్యికి రుమాలు తలిగింది. అది దీస్కొని.. ''గింత శిన్న బట్టముక్క ఆడ వెడితె.. నీకు ఎట్ల తెలిశింది?'' అంట అడిగిండు అకుబర్. దానికి బీరుబల్.. ''హజూర్! జరం నా పెయ్యికి అచ్చింది గని.. నా మనసుకు గాదు గదా!'' అంట అనంగనే.. ''కావాల్ననే పరీచ్చవట్టి సూద్దామని వెట్టిన!'' అంట అన్నడు అకుబర్.



## పద్యం - భావం

**నీళ్లలోన మొసలి నిగిడి యేనుగు బట్టు**
**బైట కుక్క చేత భంగపడును**
**స్థానబలిమిగాని తన బలిమిగాదయా**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

**తాత్పర్యం :** నీళ్లలో ఉన్న మొసలి చిన్నదైనా, అంతటి ఏనుగును కూడా నీటిలోకి లాగి చంపగలదు. కానీ, ఆ మొసలి తన స్థానమైన నీటి నుంచి బయటికి వచ్చినపుడు.. వీధికుక్క చేతిలోనూ ఓడిపోతుంది. మొసలికి ఆ బలం స్థానం వల్ల వచ్చిందే కానీ, సొంత బలం కానే కాదు.

## అమర్చండి



O O K B

**బొమ్మ ఆధారంగా అక్షరాలను సరైన క్రమంలో అమర్చండి.**

## మీకు తెలుసా?



ఎండ నుంచి రక్షణ కోసం మనం సన్ స్క్రీన్ లోషన్ రాసుకుంటాం కదా! మరి జంతువుల సంగతి? మనుషులే కాదు.. జంతువులూ సన్‌స్క్రీన్ లోషన్‌ను వాడుతాయి. కాకపోతే.. అవి సహజసిద్ధమైన మట్టిని ఇందుకు ఉపయోగించుకుంటాయి. ఏనుగులు అప్పుడప్పుడూ తమ ఒంటిపైన మట్టిని చల్లుకోవడం గమనించే ఉంటారు. నీటిలో స్నానం పూర్తయ్యాక.. ఎండ, వేడి ప్రభావం తమ శరీరంపైన పడకుండా ఇలా చేస్తాయట.